నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 16 మే 2024 | YADADRI BHUVANAGIRI



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ గెలుపే లక్ష్యంగా..

నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థి అనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రచార సరళి తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.

సమావేశంలో యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జడ్పీ చైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గుజ్జ దీపిక, భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, బూడిద భిక్షమయ్యగౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, రాంచందర్‌నాయక్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, చెరుకు సుధాకర్, కటికం సత్తయ్యగౌడ్, గుజ్జ యుగంధర్‌రావు, సూర్యాపేట జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

కేవీకేలో విత్తన మేళా

త్రిపురారం, మే 15 : మండలంలోని కంప సాగర్ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఈ నెల 24న మెగా విత్తనాల మేళా నిర్వహించనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాస్‌రావు తెలిపారు. నల్లగొండ జిల్లాలోని రైతులకు మేలైన, నాణ్యమైన విత్తనాలను అందించాలన్న ఉద్దేశంతో మెగా విత్తనాల మేళాను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేవీకే ఆధ్వర్యంలో వరి విత్తనాలు జేజీఎల్ 27356 అతిన సన్న గింజ రకం 15కిలోల బ్యాగ్ రూ.750, కేఎన్ఎం 118 దొడ్డు రకం 25కిలోలు రూ.1100, జేజీఎల్ 24423 దొడ్డు గింజ రకం 25కిలోలు 1100 రూపాయలకు లభిస్తాయని.. వ్యవసాయ పరిశోధన స్థానంలో కేఎన్ఎం 118 దొడ్డురకం 25కిలోలు రూ.1100, ఎంటీయూ 1010 దొడ్డురకం 25కిలోలు రూ.1100, కేపీఎస్ 2874 సన్న రకం 20కిలోలు రూ.1556, కేపీఎస్ 6251 సన్నరకం 25కిలోలు రూ.1200కు లభిస్తాయని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 24న ఉదయం 11గంటలకు కేవీకేకు విచ్చేయాలని, మరిన్ని వివరాల కోసం 7702544771, 9949301819 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రైతన్న రోడ్డెక్కితేనే ధాన్యం కొంటుండ్రు

లేదంటే వారాలైనా పట్టించుకునే వాళ్లే లేరు

జిల్లాలో నిత్యం అన్నదాత ఆందోళనలు

- రహదారులపై ధాన్యం రాశులు పోసి నిరసనలు
- ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్న రైతులు
- పదేండ్లలో తొలిసారి రైతన్నకు ధాన్యం కష్టాలు
- వడ్ల సేకరణను గాలికొదిలేసిన సర్కారు
- జిల్లాలో ఇప్పటి వరకు సగం కూడా కొనలే..
- లక్ష్యం 4.45లక్షల మెట్రిక్ టన్నులు.. కొన్నది 2.20 మెట్రిక్ టన్నులే..
- కాంటా వేసి వడ్లను తరలించడంలోనూ నిర్లక్ష్యమే..
- వానలకు దెబ్బ తింటున్న కర్షకులు

యాదాద్రి భువనగిరి, మే 15 (నమస్తే తెలంగాణ) : అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు అష్టకష్టాలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల సేకరణను గాలికొదిలేసింది. వారాల కొద్దీ ధాన్యం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నది. జిల్లాలో ఇప్పటి వరకు సగం కూడా వడ్లను కొనుగోలు చేయలేదు. కాంటా వేసిన ధాన్యాన్ని తరలించడంలోనూ జాప్యం చేస్తున్నది. ఫలితంగా చేసేదేం లేక రైతులు రోడ్డెక్కుతున్నారు. రోడ్లమీదకు వచ్చి ఆందోళన చేస్తేనే ప్రభుత్వం దిగివస్తున్నది. జిల్లా వ్యాప్తంగా నిత్యం రెండు, మూడు చోట్ల ధాన్యం కొనుగోళ్లు చేయాలని ఆందోళనలు చేపడుతున్నారు.

భూదాన్‌పోచంపల్లిలో పేరుకుపోయిని ధాన్యం రాశులు

కేంద్రాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే..

జిల్లాలో 2.93లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారుగా 5.25లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. పౌర సరఫరాల అధికారులు మాత్రం నాలుగున్నర లక్షల టన్నుల వడ్లు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకోసం జిల్లాలో 323 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ధాన్యం కొనుగోళ్లు మాత్రం సజావుగా సాగడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ పోసిన ధాన్యం కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు.

నెలన్నర గడుస్తున్నా..

జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలన్నర గడుస్తున్నా ఇంకా సగం ధాన్యం కూడా కొనలేదు. ఈ నెల 14వ తేదీ వరకు 22,552 రైతుల నుంచి 2,20,798 మాత్రమే కొనుగోలు చేశారు. అంటే లక్ష్యంలో సగం కూడా కొనుగోళ్లు జరుగలేదు. వీటిలో 2,09,886 మెట్రిక్ టన్నులు మిల్లులకు ధాన్యం తరలించగా, ఇంకా 10,912 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాల్సి ఉంది. ఇక రైతులకు డబ్బుల చెల్లింపుల్లోనూ ఆలస్యం జరుగుతున్నది. రూ.484.96 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.300.23 కోట్లు మాత్రమే జమ చేశారు. ఇంకా రూ.184.73 కోట్లు రైతులకు చెల్లించాలి.

హమాలీలు, లారీల కొరత..

వడ్ల కొనుగోళ్ల జాప్యానికి అధికారులు అనేక కారణాలను చెబుతున్నారు. జిల్లాలోని ఉన్న 40 రైస్ మిల్లులన్నీ ధాన్యంతో నిండుగా ఉన్నాయి. గత యాసంగికి చెందిన 1.80లక్షల మెట్రిక్ టన్నులు, వానకాలం సీఎంఆర్ ఇంకా మిల్లుల్లోనే ఉండటంతోనే స్థలం కొరత ఏర్పడింది. అదే విధంగా ఎఫ్‌సీఐ గోదాముల్లో సీఎంఆర్ దించుకోవడంలోనూ జాప్యం జరుగుతున్నది. కొనుగోలు కేంద్రాలకు టార్పాలిన్లు సరిపోవడంలేదు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టడమే గగనంగా మారింది. ఇక మిల్లుల్లో హమాలీల కొరత ఉంది. కాంటా పెట్టిన వడ్ల సంచులను మిల్లులకు తీసుకెళ్లిన లారీలను అన్‌లోడ్ చేయడానికి హమాలీలు సరిపడా లేరు. వెళ్లిన లారీలు తిరిగి రావడానికి రోజుల సమయం పడుతున్నది.

మోత్కూరు మండలంలోని సదర్శాపురంలో తూకాలైనా ఎగుమతి లేక కొనుగోలు కేంద్రంలోనే నిలిచి పోయిన ధాన్యం బస్తాలు

రైతుల ఆందోళనలు కొన్ని..

- ఈ నెల 14 : నెలలు గడుస్తున్నా ధాన్యం కొంటలేరని భువనగిరి మండలంలోని ఏటీబీ తండాకు చెందిన గిరిజన రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.
- ఈ నెల 14 : ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని భూదాన్‌పోచంపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రైతులు, లారీ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు.
- ఈ నెల 13 : పోలింగ్ రోజు భూదాన్ పోచంపల్లి మండలంలోని కనుముక్కుల గ్రామంలో ధాన్యం కొంటనే ఓటేస్తామని రోడ్డు పైకి వచ్చి ఆందోళన చేపట్టారు.
- ఈ నెల 8 : ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ భూదాన్ పోచంపల్లి మండలంలోని జూలూరు, పెద్దగూడెం రైతులు రోడ్డుపై కంచె వేసి ఆందోళన చేపట్టారు.
- ఈ నెల 8 : అడ్డగూడూరు మండలం చౌల్ల రామారంలో రైతులు రోడ్డుపై వడ్లు పోసి నిరసన వ్యక్తం చేశారు.
- ఏప్రిల్ 30 : వారాలు గడుస్తున్నా ధాన్యం కొంటలేరని వలిగొండ మండలంలోని వర్కట్‌పల్లి, సంగెం గ్రామాల రైతులు ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి రహదారిపై ధర్నా చేశారు.

కేసీఆర్ సర్కారులో సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

ఉమ్మడి రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేది. ధాన్యం కొనుగోళ్లు సరిగా జరిగేవి కాదు. రైతులకు మద్దతు ధర కూడా అంతంతమాత్రంగానే ఉండేది. దీంతో రైతులు దళారులను ఆశ్రయించి అమ్ముకునేవారు. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చాక రైతుల పరిస్థితి మెరుగైంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఎక్కడా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలకు ఆదేశించారు. దాంతో పదేండ్లలో ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరిగేది. అన్నదాత ఖాతాల్లో డబ్బులు కూడా ఎప్పటికప్పుడుఏ జమ అయ్యేవి. రైతులు కూడా ఎంతో సంతోషంగా ఉన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చాక మళ్లీ సీన్ రివర్స్‌యింది. ధాన్యం సేకరణను గాలికొదిలేసింది.

ఆందోళనలు చేస్తే తప్ప.. పట్టించుకుంటలే..

జిల్లాలో రైతులు ప్రభుత్వ తీరుతో విసిగిపోయారు. వారాలు, నెలలు గడుస్తున్నా ధాన్యం కొంటలేరు. వర్షాలతో కేంద్రాల్లోనే ధాన్యం తడుస్తున్న పరిస్థితి. తడిసిన ధాన్యం కొంటామని చెబుతున్నా ఎక్కడా కొనడం లేదు. మంచి ధాన్యానికే కొర్రీలు పెట్టి కోతలు పెడుతున్నారు. బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోలు తరుగు తీస్తున్నారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని బీ గ్రేడ్‌కు లెక్కగడుతున్నారు. దీంతో కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ఇటీవల వివిధ మండలాల రైతులు ధర్నా చేపట్టారు. పండించిన ధాన్యాన్ని తీసుకొచ్చి రాశులుగా పోసి నిరసన తెలుపుతున్నారు. ఆందోళన చేస్తే అధికారులు వెంటనే స్పందించి సదరు కేంద్రాలను సందర్శించి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. లేకుంటే మాత్రం అటు వైపు కూడా చూడటం లేదు. మరోవైపు ఆకాశంలో మబ్బులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు చోట్ల వర్షానికి ధాన్యం తడిసి అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

రోజంతా కుప్పకాడనే ఉండాల్సి వస్తున్నది

చౌటుప్పల్ మార్కెట్‌కు వడ్లు తెచ్చి నెల దగ్గరకు వస్తున్నది. మొన్నటి గాలివానకు తడిసినయి. నాలుగు రోజులు ఆరబెట్టిన. తెచ్చిన రెండు మూడు రోజులకు తూకం వేస్తే ఈ బాధలుండకపోవు. ప్రతి దినం పొద్దుగాళ్ల వచ్చి పొద్దుపోయోవరకు కుప్పకాడనే ఉండాల్సి వస్తున్నది. చాలా బాధ అయితున్నది. ఇప్పటికైనా తూకం వేయాలి. లేకుంటే వచ్చే వానలకు మళ్లీ వడ్లు తడుస్తయి.

-తూర్పింటి పారిజాత, మహిళా రైతు, రాంనగర్, చౌటుప్పల్

వానకు వడ్లు తడిసినయ్

చౌటుప్పల్ మార్కెట్‌లో వడ్లు పోసి 20రోజులు దాటింది. ఇప్పటివరకు మాయిశ్చర్ కూడా చూడలేదు. తూకం వేయడానికి ఎన్నిరోజులు పడుతుందో. ఇంతకుముందు కురిసిన వానలకు వడ్లు తడిసినయి. నాలుగు రోజులు ఆరబెట్టిన. రోజూ మార్కెట్‌కు వచ్చిపోవుడే సరిపోతున్నది. ఇతర వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నం. ఇంకో పది రోజులు అయితే రోహిణి కార్తె వస్తుంది. ఇలానే అయితే పనులు ఎట్లా చేసుకోవాలి. వాన కాలం నెత్తి మీదికి వచ్చినట్లే. ఏమి చేయాలో ఏమో. వడ్లు పండించడం కన్నా అమ్మడం పెద్ద కష్టంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకొని వడ్లు తొందరగా కొనాలి.

-బొల్లమోని శంకరయ్య, తంగడపల్లి, చౌటుప్పల్

అరకిలో తరుగు తీస్తున్నారు..

మా గ్రామంలో బస్తాకు 500 గ్రాములు ఎక్కువ తూకం వేస్తున్నారు. షార్టేజ్ వస్తదని 500 గ్రాములు తూకం వేయడంతో రైతులపై భారం పడుతున్నది. కొనుగోలు కేంద్రంలో లారీ లోడ్ కాగానే మిల్లుల వద్ద వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలి. రెండు మూడు రోజులు లారీల్లో ధాన్యం అలాగే ఉండడం వల్ల షార్టేజ్ వస్తుంది. 20 రోజుల క్రితం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన. ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది.

-మేకల మల్లారెడ్డి, శివారెడ్డిగూడెం, భూదాన్‌పోచంపల్లి మండలం

నెలన్నర గడిచినా కొనుగోలు చేసే దిక్కులేదు

మద్దతు ధరను ఆశించి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెస్తే నెలన్నర గడిచినా కొనుగోలు చేసే దిక్కు లేదు. తాలు చెత్త లేకుండా తూర్పార బట్టి, ఆరబెట్టి ధాన్యం కుప్పలు పోసి పెట్టినం. లారీల కొరత, మిల్లుల వద్ద దిగుమతి కావడం లేదని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రాశులకు తూకాలు చేయడం లేదు. సీరియల్ పేరిట నిర్వాహకులకు డబ్బులు ఇచ్చిన వారి ధాన్యం తూకాలు వేస్తున్నారు. ఇవ్వని రైతుల ధాన్యం రాశుల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇదేమిటని అడిగితే దిక్కున్న చోట చెప్పుకో అంటున్నారు. వానలు పడుతుండడంతో ధాన్యం తడుస్తుందని భయమేస్తున్నది.

- దొండ నర్సయ్య రైతు, సదర్శాపురం, మోత్కూరు మండలం

రేపటి నుంచి ఎంజీయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు చేసిన వర్సిటీ పరీక్షల విభాగం
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- ఉమ్మడి జిల్లాలో 46 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 54,444 మంది విద్యార్థులు

రామగిరి, మే 15 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఈ నెల 17నుంచి జూన్ 16 వరకు వివిధ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి వర్సిటీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. అయితే ఉన్నత విద్యామండలి నిబంధనల మేరకు పరీక్షల నిర్ణీత సమయం కంటే నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఉండదని పరీక్షల విభాగం ఇప్పటికే వెల్లడించింది. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రత్యేక పరిశీలకులు అప్రమత్తంగా ఉండి పరీక్షలు సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా నిబంధనల మేరకు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

హాజరుకానున్న 54,444 మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ రెగ్యులర్ 2, 4, 6 సెమిస్టర్లతోపాటు 1, 3, 5 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల నిర్వహణకు 46 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, ఆయా సెమిస్టర్ల పరీక్షలకు మొత్తం 54,444 విద్యార్థులు హాజరుకానున్నుట్లు ఎంజీయూ పరీక్షల నియంత్రణాధికారి డా॥ జి.ఉపేందర్‌రెడ్డి, అసిస్టెంట్ పరీక్షల అధికారిణి డా॥ లక్ష్మీప్రభ వెల్లడించారు. రెగ్యులర్ విభాగంలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరిగే 2వ సెమిస్టర్ పరీక్షలకు 12,525, నాలుగో సెమిస్టర్ 12,313, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 11,554 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే బ్యాక్‌లాగ్ పరీక్షల్లో భాగంగా సెమిస్టర్-1 పరీక్షలకు 6,923, సెమిస్టర్-3 6,050, సెమిస్టర్-5 పరీక్షలకు 5,079 మంది కలిపి మొత్తం 54,444 మంది పరీక్షలు రాయనున్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం

- రిటర్నింగ్ అధికారి హరిచందన

నీలగిరి, మే15 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణపై అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ నుంచి ఆమె పాల్గొని ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులకు వివరించారు. శాసన మండలి ఉప ఎన్నిక నిర్వహణకు సరిపడా బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనుమతులు, ఎన్నికల ప్రచారం, ఎన్నికల ర్యాలీలు, అభ్యర్థులు పాటించాల్సిన విషయాలు, పాటించకూడని అంశాలపై అభ్యర్థులకు బుధవారం జరిగిన సమావేశంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఏఆర్ఓలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ నిర్వహించాలని, అభ్యర్థులకు అనుమతులు మ్యానువల్‌గా ఇవ్వాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల లాగానే ఎఫ్ఎస్‌టీ బృందాలు కొనసాగుతాయని తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎన్నికల అధికారులు సర్ఫరాజ్ అహ్మద్, లోకేశ్ కుమార్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి, చండూరు ఏఆర్ఓ సుబ్రహ్మణ్యం, మిర్యాలగూడ ఏఆర్ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాలిగౌరారం ప్రాజెక్టుకు జలకళ

- 14 అడుగులకు చేరిన నీటి మట్టం

శాలిగౌరారం, మే 15 : శాలిగౌరారం ప్రాజెక్టు నీటి మట్టం పెరుగుతున్నది. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మూసీ నది ప్రవహిస్తుండడంతో రామన్నపేట మండలం పల్లివాడ హెడ్ వర్క్ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతున్నది. గత నెల క్రితం అడుగంటిన ప్రాజెక్టులోకి వరద నీరు రావడంతో జళకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 21అడుగులకు ప్రస్తుతం 14అడుగులు ఉన్నది. దాంతో ఆయకుట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఓట్ల డూప్లికేషన్‌పై ఈసీకి ఫిర్యాదు చేస్తాం

బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

నల్లగొండ రూరల్, మే 15 : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో ఒక్కో ఓటరు రెండేసి ఓట్లు వేసిన అంశాన్ని సీరియస్‌గా తీసుకొని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 41వ వార్డులోని పోలింగ్ స్టేషన్ 176,137లో పోలైన ఓటరు నంబర్ ఎన్‌జెడ్ఏ 2589125, ఎన్‌జెడ్ఏ 2526655 ఒక్కరే కావడంతో ఈ విషయాన్ని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు న్యాయ నిపుణులను సంప్రదించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే తిరిగి పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఈ వార్డులో ఇదే తరహాలో 100 ఓట్ల వరకు పోలైనట్లు అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. 42వ వార్డులో పోలైన ఓట్లు 41 వార్డులో కూడా పోలైనట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, రీపోలింగ్ అయ్యే వరకు కౌంటింగ్ నిలిపివేయాలని ఎన్నికల సంఘాన్ని విజ్ఞప్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం అధికారులు రంగంలోకి దిగి డూప్లికేషన్‌కు సంబంధించిన అంశాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.